క్లుప్తంగా

1న బొంబాయిస్వామి జన్మదినం

పుల్లంపేట : డిసెంబర్ 1వ తేదీన చిట్వేలి మార్గంలోని బొంబాయిస్వామి ఆలయంలో బొంబాయిస్వామి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. స్వామి జన్మదిన వేడుకలు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఏర్పాటు


ఎస్ఎఫ్ఐ సంఘానికి ఎన్నికైన విద్యార్థులు

సంబేపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ మొదటి మహాసభను ఎస్ఎఫ్ఐ మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సభలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు పవన్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ మరొక పక్క ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సమయపాలన మార్చడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు.అనంతరం విద్యార్థులు పడుతున్న కష్టాలపై వారు ఆరా తీశారు. అనంతరం మహాసభలను ప్రారంభించారు. మండల కమిటీ అధ్యక్షుడి చైతన్య, కార్యదర్శిగా ఆనంద్‌తోపాటు మరికొందరిని సభ్యులుగా నియమించారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

రాయచోటి అర్బన్ : డిసెంబర్ 1వ తేదీన కందుకూరు పట్టణంలో నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవసభను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న పిలుపునిచ్చారు. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కందుకూరులోని విక్కిరాలపేట రోడ్డులోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అపుస్మా ప్రైవేటు పాఠశాలల రాయచోటి నియోజవర్గ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ కుమార్, పీడీఎస్‌యూ నేతలు హర్షవర్ధన్, వాహిద్, అమీర్, రవీంద్ర, భాను, మంజునాథ, శివ, కేశవ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికల ప్రదానం



విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ఎంఈఓ

చిట్వేలి : శ్రీసాయి వికాస్ ఉన్నత పాఠశాలలో వివిధ పోటీ పరీక్షలలో ప్రతిభచూపిన విద్యార్థులకు శనివారం సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ ఈశ్వరయ్య ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించారు. అలాగే మంచి విలువలు కలిగి ఉండటంతోపాటు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని తెలియజేశారు. అనంతరం కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య మాట్లాడుతూ విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలలో పాల్గొనాలని, విజయం కోసం భగిరథ ప్రయత్నం చేయాలని సూచించారు.

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం


రాజశేఖర్, ఎక్సైజ్ సీఐ

సిద్దవటం : అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేస్తే అటివారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇదివరకే ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందని, దీంతో గ్రామాలలో నిఘా ఏర్పాటు చేశామన్నారు.

కార్యకర్తకు ఘన నివాళి


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : కొత్తపల్లెకు చెందిన చింతం రంగారెడ్డి మృతి చెందారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబసభ్యులకు అండగా ఉంటామని తెలియ జేశారు. సర్పంచులు ముసల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణ, మాజీ సర్పంచ్ చక్రపాణిరెడ్డి, ఉపసర్పంచ్ రెడ్డప్పరెడ్డి, మహేష్‌రెడ్డి, దేవేంద్ర, గురునాథ్‌లు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

చిరుతిళ్లు ప్రాణాంతకం!

- పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం
- ఫాస్ట్ ఫుడ్స్‌తో ఆరోగ్య అనర్థాలు
- చిన్నారుల ఆహారం పట్ల శ్రద్ధ చూపాలంటున్న వైద్యులు


కోడూరులోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న చిరుతిళ్లు

రైల్వేకోడూరు అర్బన్ : ప్రతి నిత్యం ఇంట్లో చిన్నపిల్లలు అంగళ్లలో చిరుతిళ్లకు అలవాటుపడి తింటూ తల్లిదండ్రులకు ఎన్నో కష్టాలు తెచ్చిపెడుతున్నారు. వివిధ కంపెనీల వారు తయారు చేసే చిరుతిళ్లను చిన్న పిల్లలు ప్రతి నిత్యం తింటూ రోగులను కొని తెచ్చుకుంటున్నారు. పాఠశాలలకు వెళ్లే సమయంలో ఇంట్లో డబ్బులు తీసుకుని పాఠశాలల్లో, అంగళ్ల వద్ద చిరుతిళ్లు తినడం పిల్లలు బలహీనంగా తయారవుతారు. దీనివల్ల గొంతు సమస్యలు, క్యాన్సర్, కడుపునొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులు పిల్లలకు వస్తుంటాయి. ఇవే కాకుండా వారి జీవనశైలిలో మార్పులు వచ్చి చిరుతిళ్లకే అలవాటు పడుతున్నారు. ఈ కారణంగా చిన్న పిల్లలపై మమకారం పెంచుకున్న తల్లిదండ్రులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. తాగే పాల నుంచి తినే తిండి వరకు ప్రతి ఒక్కటీ కల్తీ సరుకులు మార్కెట్‌లోకి వచ్చి అతలాకుతలం చేస్తున్నాయి. ఆఖరికి చిన్నపిల్లలు తినే చిరుతిళ్లను లాభం కోసం కల్తీతో అంగళ్లల్లో విక్రయిస్తున్నారు. దీంతో చిన్నపిల్లలు పెరిగే సమయంలో పౌష్టికాహారం లేక మంద బుద్ధి, అనారోగ్యం వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకోకపోవడంతో ఇవి యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జ్వరాలు, కడుపునొప్పి వంటివి వచ్చినప్పుడు వైద్యులు చిన్నపిల్లలకు అంగళ్లల్లో దొరికే చిరుతిళ్లకు దూరంగా ఉంచాలని వైద్యులు చెబుతున్నప్పటికీ తల్లిదండ్రులు వారిని అదుపుచేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని చిరుతిళ్లు, ఫాస్ట్ ఫుడ్స్‌కు ఎంత దూరం ఉంచగలిగితే అంత మంచిది. లేకుంటే ఆసుపత్రుల్లో చికిత్సలకు వేలకు వేలు లెక్కలు సమర్పించాల్సి వస్తుంది.

చిరుతిండ్ల వల్ల అనారోగ్యం



చిరుతిండ్ల వల్ల చిన్నపిల్లలకు అనారోగ్య సమస్యలు అధికంగా వస్తుంటాయి. ఇవి కనిపించడానికి ఆకర్షణీయంగా.. రుచిగా ఉండేందుకు పలు రసాయనాలు వాడతారు. ఇవి పిల్లల ఆరోగ్యానికి చేటు చేస్తుంది. తల్లిదండ్రులు పిల్లలకు ఇలాంటివి తినకుండా ఉండేలా చూసుకోవాలి.

– డాక్టర్ వెంగల్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు, రైల్వేకోడూరు

కొనివ్వకుంటే మారాం చేస్తారు



చిన్నపిల్లలకు చిరు తిండ్లు కొనివ్వకూడదని డాక్టర్లు చెబుతున్నప్పటికీ ఇంట్లో పిల్లలు మారాం తట్టుకోలేకే కొనిస్తున్నాం. మళ్లీ మేమే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వాలు రసాయనాలు వాడినా ఫాస్ట్ ఫుడ్స్‌పై నిషేధం విధించి, ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి.

– కాకర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరాజపురం, రైల్వేకోడూరు

పేద విద్యార్థులకు 'విద్యాజ్యోతి' ప్రోత్సాహకాలు


పుల్లంపేట: విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాస్


గాలివీడు: విద్యార్థినికి ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న బ్యాంకు అధికారులు

గాలివీడు : ప్రభుత్వ రంగంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వినూత్నమైన సేవలకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ గాలివీడు శాఖ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలోని ప్రతిభ కనబరిచిన నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు కమలమ్మ ,అఖిల, రెడ్డిశ్వేతలకు ఒక్కొరికి రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు చీఫ్ మేనేజర్ వెంకట రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు పరిధిలో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ వర్గాలకి చెందిన విద్యార్థినులకు ప్రోత్సాహకాలను అందించడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ నీరజ, ఫీల్డ్ ఆఫీసర్ సాయికృష్ణ, విజయ్‌లతో కలిసి ఆయన విద్యార్థినులకు చెక్కులను అందజేశారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సహకారంతో పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్, కొత్తపేట హైస్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిదవ తరగతులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ,ఎస్టీ పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు నగదును శుక్రవారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాజ్యోతి పథకం ద్వార ఒక్కో విద్యార్థికి రూ.5 వేలు నగదు వారివారి ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ఈ నగదు విద్యార్థుల విద్యాభ్యాసంకు ఉపయోగపడుతుందన్నారు. పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రూ. 150 కోట్లతో లావాదేవీలు నిర్వహిస్తూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శశికళ, చంద్రశేఖర్, జగ్గుబాబు, నవీన్, కస్తూర్బాగాంధి పాఠశాల ప్రిన్సిపాల్ రూత్ మేరీ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు అవలంభించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీధర్

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు పండించే పొలాల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు నిర్వహించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంభించాలన్నారు. పండించే పంటలపై సమస్యలు ఉంటే అధికారులు, శాస్త్రవేత్తలను రైతులు సంప్రదించాలని ఆయన కోరారు. అనంతరం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ కవిత, శ్రీరాములు, సుధాకర్, శ్రీఖర్, ఇతర మండలాల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

రాయచోటి అర్బన్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్రైవర్లకు కనీస వేతనం కింద రూ. 24,500లు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య, బి.వి.రమణ, రాంబాబు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం సీఐటీయూ అనుబంధ మున్సిపల్ యూనియన్ నేతలు కమిషనర్ వాసుబాబును కలుసుకుని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది మున్సిపల్ వర్కర్స్ రాష్ట్రవ్యాప్త సమ్మె ఫలితంగా వాహనాల డ్రైవర్‌లకు రూ.24,500ల వేతనం ఇవ్వాలంటూ ప్రభుత్వం జీఓ నం. 36 విడుదల చేసిందన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో సాంకేతిక సమస్యల వలన డ్రైవర్లుగా కొనసాగుతున్న వారు ఆప్కాస్‌లో స్వీపర్లుగా నమోదయ్యారన్నారు. ఈ పొరపాటును సరిదిద్దడం ద్వారా డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు.

నిత్యపూజస్వామి కోనకు శివభక్తులు


నిత్యపూజ స్వామి కోనకు పయనమవుతున్న మాలధారులు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన శివమాల ధరించిన భక్తులు శుక్రవారం ఇరుముళ్లతో శ్రీ నిత్యపూజా స్వామి కోనకు ప్రయాణమయ్యారు. స్థానిక శివమాల ధరించిన భక్తులు 41 రోజులు పూర్తవ్వడంతో స్థానిక కోదండ రామస్వామి ఆలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముళ్లు కట్టుకుని నిత్యపూజస్వామి పుణ్యక్షేత్రానికి బయలుదేరారు.

మాలల సింహ గర్జనను జయప్రదం చేయండి


సింహ గర్జన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరురూరల్ : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పును రద్దు చేయాలనే డిమాండ్‌తో డిసెంబర్ 15న గుంటూరులో నిర్వహించనున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మాలల సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల మేధావులు, రాజకీయ నాయకులు, మాల ఉద్యోగులు, అంబేడ్కర్ వాదులు, మాల విద్యార్థులు లక్షలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక మండల అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు రామాంజులు, నక్క వెంకటరమణ, గుండ్లూరి జయరామచంద్రయ్య, మోహన్‌బాబు, ఊటుపల్లె రమణ, లోకనాథ పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం (నేడు) ఉదయం 11:00 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ వాసుబాబు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాషా అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. జిల్లా కేంద్రం అభివృద్ధిపై సమావేశంలో చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం



ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె, డేగనవాండ్లపల్లె గ్రామాల సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తమకు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న సమాచారం రావడంతోమా సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేయగా బండి కనుమ రహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుక ట్రాక్టర్‌లను మండల తహసీల్దారుకు అప్పజెబుతామన్నారు.

లబ్ధిదారులు ధృవీకరణ పత్రాలు అందజేయాలి

రామాపురం : నియోజకవర్గంలోని అన్ని మండలాలకు పక్కా గృహాలకు అర్హులైన లబ్ధిదారులు కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలతోపాటు ఇంటికి సంబంధించిన దస్తావేజుల జిరాక్స్‌లను ఆయా మండలాలకు సంబంధించిన హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలని హౌసింగ్ డీఈ కే.ఎస్.ఎం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఒకవేళ ధృవీకరణ పత్రాలు అందజేయని పక్షంలో మంజూరైన పక్కా గృహాలు రద్దవుతాయని తెలియజేశారు.

నందలూరు విద్యార్థినికి పీహెచ్‌డీ పట్టా


నిశ్చిత

నందలూరు : మండలంలో ఏఎస్ఐగా పని చేస్తున్న మూడే శంకర్ నాయక్ కుమార్తై మూడే నిశ్చిత బెంగళూర్ రెనో లా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. యూనివర్సిటీ స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. రెనో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతులమీదుగా శుక్రవారం డాక్టరేట్ అందుకున్న నిశ్చితకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

రోడ్డు సమస్య తీర్చండి

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో మట్లి వడ్డిపల్లి ప్రజలు తాము ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య తీర్చాలంటూ శుక్రవారం మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డికి గ్రామ ప్రజలు విన్నవించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డును ఫార్మేషన్ రోడ్డుగా ఏర్పాటు చేయడం జరిగిందని, కొందరు వ్యక్తులు ఆ రోడ్డు తమ పట్టా భూముల్లో ఉందని అడ్డుకోవడంతో రోడ్డును ఏర్పాటు చేసేందుకు గ్రామ సర్పంచ్ ముందుకు రాలేదన్నారు. తాము ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించి సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేసేలా చూడాలని గ్రామస్తులు ఎంపీపీని కోరారు.

'బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ తీసెయ్యండి'


సిబ్బందికి సలహాలు ఇస్తున్న విద్యుత్ ఎస్ఈ రమణ

ఒంటిమిట్ట : విద్యుత్ బకాయిలు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని కడప జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ ఆదేశించారు. శుక్రవారం ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలలో జిల్లా విద్యుత్ శాఖ సూపరిటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ విద్యుత్ కార్యాలయాలను విద్యుత్ బిల్లుల వసూళ్లపై ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులు, సిబ్బంది సాధారణ విధులను పర్యవేక్షించారు. బకాయిల వసూళ్లపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని, సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి మరొక నెలరోజులు గడువు ఇచ్చి బిల్లు కట్టమంటుందంటే మొత్తం రెండు నెలలు గడువును వినియోగదారులకు ఇస్తోందని, కావున విద్యుత్ బకాయిల వసూళ్లల్లో రాజీ వద్దని, విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్‌లను తొలగించాలని ఆదేశించారు. విధులలో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ఏఈ ఉదయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కార్తీక్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే లక్ష్య సాధన


బహుమతులను అందజేసిన హెచ్ఎం, టీచర్లు

సిద్దవటం : నేటి సమాజంలో లక్ష్యం సాధించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించుకోవాలని సిద్దవటం జెడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్విజ్ పోటీల్లో మొదటి బహుమతిని భాకరాపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రెడ్డి చెంద్రాయుడు, ప్రసన్న, అమూల్య, రెండవ బహుమతిని సిద్దవటం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు లక్ష్మీప్రసన్న, గంగోత్రి, సాయి రిషిత గెలుచుకున్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ వెంకట సుదర్శన్, ఉపాధ్యాయులు హరికొండయ్య పాల్గొన్నారు.


రేషన్, ఆధార్ కార్డులకు నోచుకోని గిరిజనులు


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న బీకేఎంయూ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కుక్కలదొడ్డి గిరిజన కాలనీ వాసులు ఇంత వరకు రేషన్, ఆధార్ కార్డులకు నోచుకోలేని దుస్థితిలో ఉన్నారని శుక్రవారం నియోజకవర్గ బీకేఎంయూ నాయకులు జయరామయ్య పేర్కొన్నారు. మండల కార్యదర్శి వినయ్ ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇంతవరకు ఇంటి స్థలాలు, గృహాలు, తాగునీరు, రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులను మంజూరు చేయలేదంటే పరిపాలిస్తున్న నాయకులు సిగ్గు తెచ్చుకోవాలన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి గిరిజనులకు భూమి, ఇల్లు, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ కుమార్, పార్వతి, సుబ్బమ్మ, గంగాదేవి, మల్లికార్జున, పాటిరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు


రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళలు


గాజుల అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి కుంకమార్చన చేశారు. అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు.

అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు రాహుకాల పూజ విశిష్టతను తెలియజేసి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం




అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న అబ్కారీ సీఐ మల్లిక

రాజంపేట : మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం అవుతాయనేది విద్యార్థులు గుర్తుంచుకోవాలని రాజంపేట అబ్కారీ సీఐ మల్లిక అన్నారు. శనివారం అన్నమాచార్య యూనవర్సిటీలో యాంటీ డ్రగ్స్ అవరేనెస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే, తిరిగి కోలుకోవడమనేది చాలా కష్టమన్నారు. అందుకే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన సదస్సుల ద్వారా విద్యార్థులను చైతన్య పరుస్తున్నామన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా విద్యార్థులు తమ జీవితాలను రూపుదిద్దుకోవాలన్నారు. అలాగే విద్యార్థులను కళాశాలలో చేర్పిస్తే సరిపోదు, వారి కదలికలను ఎప్పటికప్పుడూ గమనిస్తుండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.నారాయణ, అబ్కారీ ఎస్ఐ సుధాకర్, ఏయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి ఓబులపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై కేసు నమోదు

సుండుపల్లె : మండల పరిధిలోని పొలిమేరపల్లె గ్రామ పంచాయతీ ఎనుగొండువాండ్లపల్లె సమీపంలో పంచాయతీ భూమిని ఆక్రమించి ఉలవ పంటను వేశాడని అయ్యప్పరెడ్డి అనే వ్యక్తిపై పొలిమేరపల్లె పంచాయతీ సెక్రటరీ సాదు శరత్‌గిరిరెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం ఎస్ఐ ఎం.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే సర్వే నెంబరు. 536–2లో 70 సెంట్ల భూమిని కలెక్టర్ ఆదేశానుసారం తహసీల్దార్ ఆ భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించారు. గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉండే ఆ భూమిని ఎవరి అనుమతి లేకుండా అయ్యప్పరెడ్డి చదును చేసి ఉలవ పంటను సాగు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో భువనేశ్వరీదేవి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో వెలసిన భువనేశ్వరీ దేవికి కార్తిక మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో..

పెనగలూరు : మండల కేంద్రంలోని పెనగలూరు గ్రామంలో వెలసిన శాంతి లింగేశ్వరస్వామి శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు వేదపండితులచే అర్చనలు చేయించి మొక్కులు చెల్లించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు: అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని బొంతలవారిపల్లెకు చెందిన ఎస్. శ్రీనివాసులు (45) వ్యవసాయం కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిడి చేయడంతో మనస్థాపం చెందాడు. దీంతో పురుగుల మందు తాగి వ్యవసాయ పొలం వద్ద అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.